ఆగస్టు 1 నుంచి బహుభాషా నాటకోత్సవాలు

మూడు రోజులపాటు వేడుకలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : ఆగస్టు 1 నుంచి 3 వరకు 18వ జాతీయ బహుభాషా నాటకోత్సవాలను హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించనున్నట్టు అభినయ థియేటర్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని ఎలక్షన్ కమిషన్ కార్యాలయంలో కమిషనర్ పార్థసారథి ఉత్సవాల పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ సాంస్కృతిక శాఖ, అభినయ థియేటర్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో తెలుగు, కన్నడ, నాగ, మణిపురి, మరాఠీ నాటకాలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5:30 గంటలకు ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు

డీఎస్సీ పరీక్షల వాయిదాకు హైకోర్టు నిరాకరణ

కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి నోటీసులు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలను వాయిదా వేసేందుకు హైకోర్టు నిరాకరించింది. పరీక్షలు గురువారం నుంచి ప్రారంభం అయ్యాయని ఈ పరిస్థితుల్లో పరీక్షలను నిలిపివేస్తూ మధ్యంతర ఆదేశాలను జారీచేయబోమని తేల్చి చెప్పింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని విద్యాశాఖను ఆదేశించింది. అభ్యర్థులు లేవనెత్తిన అభ్యంతరాలపై కౌంటర్ పిటిషన్‌లో వివరణ ఇవ్వాలని న్యాయమూర్తి జస్టిస్ పుల్లా కార్తీక్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు. తదుపరి విచారణను ఈనెల 28కి వాయిదా వేశారు. ఈనెల 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు జరగనున్న టీఆర్టీ (డీఎస్సీ) పరీక్షలను వాయిదా వేయాలంటూ వికారాబాద్‌కు చెందిన ఆర్ అశోక్ సహా పది మంది దాఖలుచేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ జరిపింది.

డీఎస్సీ పరీక్షలు ప్రారంభం

తొలిరోజు 83 శాతం మంది హాజరు

పలువురు అభ్యర్థుల గృహనిర్బంధం

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఉపాధ్యాయ నియామక పరీక్షలు(డీఎస్సీ) కొందరు అభ్యర్థుల నిర్బంధం మధ్య గురువారం ప్రారంభమయ్యాయి. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో మొదలైన ఈ పరీక్షలు ఆగస్టు 5 వరకు కొనసాగనున్నాయి. తొలిరోజు 26 వేల మందికి 83 శాతం పరీక్షలకు హాజరైనట్టు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 56 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేయగా, ఒక్క గ్రేటర్ హైదరాబాద్‌లోనే 27 కేంద్రాలు ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించారు. తమను గృహ నిర్బంధంలో ఉంచి పరీక్షలకు హాజరు కానివ్వలేదని పలువురు అభ్యర్థులు ఆరోపించారు.

20,21న ఆన్‌లైన్‌లో సింగరేణి పరీక్షలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : సింగరేణి సంస్థలో 272 ఎక్స్‌టర్నల్ పోస్టుల భర్తీకి హైదరాబాద్ కేంద్రంగా ఈ నెల 20, 21 తేదీల్లో నిర్వహించే పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు ఆ సంస్థ చైర్మన్ బలరాం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 18,665 మంది అభ్యర్థులకు హాల్‌టికెట్లు జారీ చేసినట్లు వెల్లడించారు. తొలిసారిగా కంప్యూటర్ ఆధారిత పరీక్షలు(సీబీటీ) నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందుకోసం హైదరాబాద్ జంట నగరాల్లోని 12 పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకునే క్రమంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే 08744-249992 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మహీంద్రాలో డిజైన్ ఇన్నోవేషన్ కోర్సు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మహీంద్రా విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ కోర్సును ప్రారంభించినట్టు వీసీ డాక్టర్ యాజులు మేడూరి తెలిపారు. పినిన్ ఫరీనా డిజైన్ అకాడమీ, టొరినో, ఇటలీ, షెనోయ్ ఇన్నోవేషన్ స్టూడియో ఐడీసీ ఐఐటీబీతో స్కూల్ ఆఫ్ డిజైన్ ఇన్నోవేషన్ భాగస్వామ్యంతో కోర్సును ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు. తొలి అకడమిక్ సెషన్ వచ్చేనెల 15 నుంచి బ్యాచిలర్స్ ప్రోగ్రామ్ ఇన్ డిజైన్‌తో ప్రారంభమవుతుందని వెల్లడించారు. 10+2 విద్యార్థులు ఈ కోర్సుకు అర్హులని తెలిపారు.

'హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్' కీ విడుదల

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల భర్తీ పరీక్షలకు సంబంధించిన ప్రాథమిక కీని గురువారం టీజీపీఎస్సీ విడుదల చేసింది. కీ వివరాలను వెబ్‌సైట్‌లో పెట్టింది. ఈ నెల 22 నుంచి కీతో పాటు రెస్పాన్స్ షీట్లు కూడా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపింది. అభ్యంతరాల స్వీకరణకు ఈ నెల 27 వరకు గడువు విధించింది.

గ్రూప్ 2 పరీక్షలు వాయిదా!

- నిరుద్యోగులతో కాంగ్రెస్ ప్రతినిధుల చర్చలు
- 24 గంటల్లో వెబ్‌నోట్ వస్తుందని హామీ
- గ్రూప్ 2, 3 పోస్టుల పెంపుపై స్పష్టత కరువు
- గ్రూప్ 1లో 1:100 నిష్పత్తిపై నిరుద్యోగుల పట్టు
- చర్చలపై నిరుద్యోగ ప్రతినిధుల అసంతృప్తి

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): టీజీపీఎస్సీ గ్రూప్ 2 పరీక్ష వాయిదా వేసే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉన్నట్టు తెలుస్తున్నది. ఈ మేరకు గురువారం సుమారు 50 మంది నిరుద్యోగ ప్రతినిధులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు జరిపిన చర్చల్లో ఈ విషయం తేటతెల్లమైంది. అయితే ఇతర డిమాండ్లపై ఎలాంటి హామీ రాకపోవడంతో ఈ చర్చలు ఫలించలేదని నిరుద్యోగ ప్రతినిధులు తేల్చిచెప్పారు. దీంతో మళ్లీ నిరుద్యోగ ఉద్యమ కాగడా ఇప్పట్లో చల్లారేలా కనిపించడం లేదు. ఒకవైపు అభ్యర్థుల వినతిని పట్టించుకోకుండా మొండిగా డీఎస్సీ పరీక్షలు నిర్వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం కేవలం గ్రూప్ 2 పరీక్షలు వాయిదా వేయడానికే సానుకూలత వ్యక్తంచేసింది. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి, 24 గంటల్లో వెబ్‌నోట్ వచ్చేలా కృషి చేస్తామన్న ప్రభుత్వ ప్రతినిధుల హామీతో నిరుద్యోగుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నది. నెలరోజుల తమ పోరాటాలకు ప్రభుత్వం ఒక మెట్టు దిగినా తమ డిమాండ్ల పరిష్కారానికి మాత్రం పూర్తి భరోసా రాలేదని నిరుద్యోగులు మండిపడుతున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం గ్రూప్ 2, 3లో అసలు పోస్టుల సంఖ్యను పెంచుతారా? లేదా? అన్న అంశంపై స్పష్టత కరువైందని ఆగ్రహంతో ఉన్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ ప్రతినిధులు తమతో జరిపిన చర్చలు ఫలప్రదంగా లేవని నిరుద్యోగ ప్రతినిధులు తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతినిధులుగా ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, మానవతారాయ్, చరణ్‌కౌశిక్, బాలలక్ష్మి తదితరులు నిరుద్యోగులతో చర్చలు జరిపారు. నిరుద్యోగుల తరపున దాదాపు 50 మంది ప్రతినిధులు ఈ చర్చల్లో పాల్గొన్నట్టు సమాచారం.

గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 సంగతి ఏమైంది?

గ్రూప్-1 మెయిన్స్ కోసం 1:100 నిష్పత్తి అమలు విషయమై నిరుద్యోగ ప్రతినిధులు చర్చల సందర్భంగా నిలదీసినట్టు సమాచారం. దీనిపై సాంకేతిక సమస్యలను సాకుగా చూపి ప్రభుత్వం తప్పించుకోజూస్తున్నదని నిరుద్యోగ ప్రతినిధులు మండిపడుతున్నారు. ఎట్టి పరిస్థితుల్లో గ్రూప్ 1 కోసం విడుదల చేసిన జీవో 29ను వెనక్కి తీసుకొని, కొత్తగా అమల్లోకి తెచ్చిన షార్ట్‌ఫాల్ విధానం రద్దు చేసి, కమ్యూనిటీ పోస్టుల వారీగా అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేసే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

డిమాండ్ల సాధన కోసం ఉద్యమాలే దిక్కు

ఉద్యోగార్థుల డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమాలే దిక్కని నిరుద్యోగ నేతలు పిలుపునిచ్చారు. కేవలం మొక్కుబడిగానే ప్రభుత్వం చర్చలు జరిపిందని, తమ డిమాండ్లను నెరవేరుస్తామని స్పష్టమైన హామీని ఇవ్వలేకపోయిందని నిరుద్యోగులు మండిపడుతున్నారు. గ్రూప్ 1, జీవో 29 రద్దు, గ్రూప్ 2, 3లో అదనపు పోస్టుల పెంపు, గురుకుల పోస్టుల్లో రీలింక్విష్‌మెంట్ అమలు, నిరుద్యోగ భృతి, జీవో 46న రద్దు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, జాబ్ క్యాలండర్ విడుదల వంటి డిమాండ్లను పరిష్కరించేంత వరకు ఉద్యమాన్ని ఆపే ప్రసక్తే లేదని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ స్పష్టం చేసింది.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి

నిరుద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలి

రౌండ్‌టేబుల్ మీటింగ్‌లో ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 18: రాష్ట్రంలోని నిరుద్యోగ యువత కోరుతున్న న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఓయూ జేఏసీ, టీఎస్‌జేఏసీ, నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం జరిగిన నిరుద్యోగ, విద్యార్థి రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని యువత, నిరుద్యోగులు, విద్యార్థుల వల్లే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, వారి ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపైనే ఉన్నదని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం పోరాటం చేసింది విద్యార్థులేనని గుర్తుచేశారు. ఆనాడు ఏ ఒక్క నాయకుడి కుటుంబసభ్యులు చనిపోలేదని, కేవలం విద్యార్థులే ఆత్మబలిదానం చేసుకున్నారని పేర్కొన్నారు. గ్రూప్ 2, గ్రూప్ 3 నోటిఫికేషన్లలో పోస్టుల సంఖ్యను పెంచి డిసెంబర్‌లో పరీక్షలను నిర్వహించాలని కోరారు. గ్రూప్ 1లో 1:100 నిష్పత్తితో మెయిన్స్‌కు ఎంపిక చేయాలని డిమాండ్ చేశారు. 25 వేల ఉద్యోగాలతో తక్షణమే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడంతో పాటు నిరుద్యోగ భృతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రవాణాశాఖలో కొత్తగా 110 మంది ఎంవీఐలు

- ఎంవీఐల శిక్షణ కాలం పెంపు
- ఆదాయం పెంచడమే లక్ష్యంగా చర్యలు

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : రవాణాశాఖకు కొత్తగా 110 మంది మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు (ఎంవీఐలు) రాబోతున్నారు. గతంలో ఎంవీఐలకు మూడు నెలల శిక్షణ ఉండేది. కొత్తవారికి ఈ వ్యవధిని పెంచడంతో పాటు విస్తృత శిక్షణ ఇవ్వనున్నారు. ఇటీవల ఇతర రాష్ట్రాల్లోని విధానాలపై అధ్యయనం చేసిన అధికారులు నివేదికను రవాణాశాఖకు అందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.8,478 కోట్ల భారీ రాబడి లక్ష్యాన్ని నిర్దేశించింది. 2024-25లో లైఫ్‌ట్యాక్స్ రూ.6,024.97 కోట్లు, త్రైమాసిక పన్ను, గ్రీన్ ట్యాక్స్ రూ.75.68 కోట్లు, ఫీజులు 648.10 కోట్లు, ట్రాఫిక్ చలాన్ల రూపంలో రూ.300 కోట్లు, బకాయిల వసూలు రూ.186.03 కోట్లు, యూజర్ చార్జీలు రూ.159.65 కోట్లు ఆర్జించాలని ఆర్థిక శాఖ నిర్ధారించింది. రవాణాశాఖకు రాబడి సమకూర్చే అంశాల్లో లైఫ్ ట్యాక్స్ ఒకటి. 2022-23లో రూ.5,345 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశిస్తే రూ.6,390.80 కోట్ల ఆదాయం వచ్చింది. 2023-24లో రూ.7,212.60 కోట్లకు రూ.6,990.29 కోట్లు వచ్చింది.

ఎగదోశారు.. నట్టేట్లో వదిలేశారు!

- పదవులు దక్కగానే పెదవులు మూశారు
- కాంగ్రెస్ నేతల తీరుపై గురుకుల అభ్యర్థుల గుర్రు
- రీలింక్విష్‌మెంట్‌పై తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం
- పోస్టులను బ్యాక్ లాగ్ చేసే కుట్రని ఆగ్రహం

తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధం..

ఇప్పటికే ఆయా సొసైటీలు పోస్టింగ్స్ ఇచ్చే ప్రక్రియను ప్రారంభించాయని, రిలింక్విష్‌మెంట్ అమలు చేయకుండా పోస్టింగ్స్ ఇచ్చిన తరువాత చేసేదేమీ లేదని అభ్యర్థులు చెప్తున్నారు. పలువురు మంత్రులకు, కాంగ్రెస్ సీనియర్ నేతలకు, ఆఖరికి సీఎం రేవంత్‌రెడ్డి, సీఎంవో అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిలింక్విష్‌మెంట్ అమలు కోసం ఆమరణ దీక్షకు పూనుకుంటామని అభ్యర్థులు వెల్లడిస్తున్నారు. అందుకు సంబంధించిన కార్యాచరణ రూపొందించుకొంటున్నామని, ఇక ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకుంటామని గురుకుల అభ్యర్థులు తెలిపారు.

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ): ''ఎన్నికలకు ముందు ఓట్ల కోసం ఎగదోశారు. కాంగ్రెస్ తరపున ప్రచారం కోసం ఊరూరా తిప్పారు. ఓట్లను వేయించుకున్నారు. పదవులను పొందారు. మమ్ముల నట్టేట్లో వదిలేసి పెదవులు మూసుకున్నారు'' అంటూ పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలపై గురుకుల అభ్యర్థులు నిప్పులు చెరుగుతున్నారు. న్యాయం చేయాలని 4 నెలలుగా తిరుగుతున్నా ఆ దిశగా స్పష్టమైన హామీ ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. పోస్టుల భర్తీలో డిసెండింగ్ ఆర్డర్‌ను పాటించకుండా అన్యాయం చేస్తున్నారని, బ్యాక్‌లాగ్ పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని ధ్వజమెత్తుతున్నారు. ఇకనైనా స్పష్టత ఇవ్వాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు.

వెయిటింగ్ జాబితాపై స్పష్టత కరువు

గురుకులాల్లో 9,210పోస్టులను డిసెండింగ్ ఆర్డర్‌లో భర్తీ చేస్తామని, ఒక్క పోస్ట్ కూడా బ్యాక్‌లాగ్ లేకుండా చూస్తామని ట్రిబ్ నోటిఫికేషన్ ఇచ్చింది. రాత పరీక్షల వరకు అనేకసార్లు బాహాటంగానే చెప్తూ వచ్చింది. అయితే తుదకు ఎన్నికల అనంతరం మాత్రం అందుకు విరుద్ధంగా డిసెండింగ్ ఆర్డర్

హామీని తుంగలో తొక్కి పోస్టుల భర్తీని చేపట్టింది. తొలుత పీజీటీ, ఆ తరువాత డీఎల్, జేఎల్, టీజీటీ పోస్టులకు మెరిట్ జాబితాలను ప్రకటించి అభ్యర్థులకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇచ్చింది. దీంతో వేలాది పోస్టులు బ్యాక్‌లాగ్ పడే అవకాశం ఉన్నదని అభ్యర్థులు వాదిస్తున్నారు. కనీసం రిలింక్విష్‌మెంట్ విధానాన్ని అమలు చేయాలని, తద్వారా పోస్టులు బ్యాక్‌లాగ్ పడకుండా ఉంటాయని పేర్కొంటున్నారు. గత ఫిబ్రవరి నుంచి ట్రిబ్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా ప్రభుత్వం నుంచి స్పష్టత రాలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

ప్రధానంగా ఆ నలుగురి నేతలపైనే..

నాడు ధర్నాలు చేయించిన నేతలే నేడు తమను చులకనగా చూస్తున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓ యువనాయకుడితోపాటు ఎమ్మెల్సీ పదవి దక్కించుకున్న ఓ నేత ఇప్పుడు తమ సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. ఎప్పుడు అడిగినా నేడు రేపు అంటూ దాటవేస్తున్నారే తప్ప ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు ఇప్పించడంలేదని మండిపడుతున్నారు. ఇదేమని అడిగితే ఉన్నత పదవి దక్కించుకున్న మరో కాంగ్రెస్ నేత తమనే దుర్భాషలాడుతున్నారని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై ఇటీవల చర్చించేలా చూస్తానని సదరు యువనేత ఇచ్చిన హామీ సైతం ఉత్తముచ్చటే అయ్యిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు.

'దాశరథి' పురస్కారానికి అందెశ్రీ ఎంపిక

తెలుగు యూనివర్సిటీ, జూలై 18: శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయం ప్రదానం చేస్తున్న మహాకవి దాశరథి కృష్ణమాచార్య సాహితీ పురస్కారం- 2024కు ప్రజావాగ్గేయకారుడు అందెశ్రీని ఎంపిక చేసినట్టు భాషానిలయం గౌరవ కార్యదర్శి ఉడయవర్లు గురువారం తెలిపారు. 23న సుల్తాన్‌బజార్ భాషానిలయం ఆడిటోరియంలో అందెశ్రీని రూ. 10 వేలు, జ్ఞాపికతో సత్కరిస్తామన్నారు.

యార్లగడ్డకు సినారె పురస్కారం

రసమయి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సీ నారాయణరెడ్డి 93వ జయంతిని ఈనెల 22న తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహిస్తున్నట్టు సంస్థ అధ్యక్షుడు రాము గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సినారె పురస్కారాన్ని ఏపీ అధికార భాషా సంఘం పూర్వ అధ్యక్షుడు, పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు ప్రదానం చేయనున్నట్టు ఆయన వెల్లడించారు.

రెగ్యులరైన అధ్యాపకులకు బదిలీల్లో అన్యాయం

సూర్యాపేట, జూలై 18 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర వ్యాప్తంగా 11 ఏండ్లుగా జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్ కాలేజీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసి రెగ్యులరైన 3,750 మంది అధ్యాపకులకు ప్రస్తుత బదిలీల్లో తీరని అన్యాయం జరుగుతున్నది. వారంతా 11 ఏండ్లుగా ఒకే చోట పని చేస్తున్నా ఉన్నత విద్యాశాఖ వారికి బదిలీల్లో అవకాశం కల్పించడంలేదు. 2013లో ఐదేండ్ల సర్వీసు పూర్తి చేసుకున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను బదిలీ చేసిన ఉన్నత విద్యాశాఖ.. రెగ్యులర్ అయ్యాక బదిలీ చేయకపోవడంపై వారిలో అసహనం నెలకొన్నది. ఈ విషయమై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి నేతృత్వంలో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 ఆధ్వర్యంలో ఉన్నత విద్యాశాఖ అధికారులను కలిసి వినతిపత్రాలు అందించినా స్పందన లేదు. బదిలీలపై నిషేధం ఎత్తేస్తూ ప్రభుత్వం జీవో 80 జారీ చేయగా.. దీని ప్రకారం కనీసం రెండు సంవత్సరాల సర్వీసు నిబంధన అమలు చేయాలి. జీవోలో స్పౌజ్, మెడికల్ కాటగిరీ ఉద్యోగులకు రెండు సంవత్సరాల నిబంధన వర్తించదని పేర్కొంది. ఈ లెక్కన కాంట్రాక్ట్ బేస్డ్ నుంచి ఏడాది క్రితం రెగ్యులర్ అయిన స్పౌజ్, మెడికల్ గ్రౌండ్‌లో ఉన్న ఉద్యోగులంతా బదిలీలకు దరఖాస్తు చేసుకోవచ్చు. జీవో 80కి అనుబంధంగా ఉన్నత విద్యాశాఖ మరో జీవో 118ను తీసుకొచ్చింది. ఈ జీవోలో స్పౌజ్, మెడికల్ కాటగిరీ ఉద్యోగులకు అవకాశం కల్పించకపోవడంతో వెయ్యి మంది అధ్యాపకులు బదిలీ అవకాశం కోల్పోతున్నారు. మళ్లీ బదిలీల ప్రక్రియ ఎప్పుడు ఉంటుందో తెలియదని పేర్కొంటున్నారు. 11 ఏండ్లుగా ఒకే చోట కాంట్రాక్ట్ బేస్డ్‌గా పనిచేస్తూ ఏడాది క్రితం రెగ్యులర్ అయిన అధ్యాపకుల పట్ల ఉన్నత విద్యాశాఖ మానవీయ కోణంలో ఆలోచించి బదిలీలకు అవకాశం కల్పించాలని తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సురేశ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్ కోరారు. ప్రభుత్వం ఇచ్చిన జీవో 80 ప్రకారమైనా కుటుంబాలకు దూరంగా ఉంటున్న స్పౌజ్, మెడికల్ కాటగిరీ ఉద్యోగులు బదిలీకి దరఖాస్తు చేసుకొనే అవకాశం కల్పించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రమోషన్లలో పారదర్శకత లోపం

ఉపాధ్యాయులకు నష్టం జరిగితే ఊరుకోం • టీజీ యూటీఎఫ్ మైనార్టీ విభాగం హెచ్చరిక

హైదరాబాద్, జూలై18 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాలయాల సొసైటీలో(టీజీఎంఆర్ఈఐఎస్)చేపట్టిన ఉపాధ్యాయులు, సిబ్బంది బదిలీలు, పదోన్నతుల్లో పారదర్శకత లోపించిందని టీజీ యూటీఎఫ్ మైనార్టీ విభాగం మండిపడింది. ప్రమోషన్లు, బదిలీల్లో ఏ ఒక్క ఉపాధ్యాయుడికి నష్టం జరిగినా ఊరుకోబోమని టీజీయూటీఎఫ్ అధ్యక్షుడు రాంబాబు, ప్రధాన కార్యదర్శి మహేశ్ గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మైనార్టీ గురుకులాల్లో చేపట్టిన ప్రమోషన్లు, బదిలీలు గందరగోళంగా మారాయన్నారు. ఇటీవల విడుదల చేసిన జాబితా తప్పులతడకగా ఉందని, పదోన్నతులకు సంబంధించి తుది అర్హుల జాబితా ప్రకటించకపోవడమేంటని ప్రశ్నించారు. జేఎల్ క్యాడర్‌కు పదోన్నతులు, బదిలీలు చేపట్టి ఆ తర్వాత పీజీటీలకు జేఎల్‌గా పదోన్నతులు కల్పించాలని, మిగిలిన పీజీటీలకు బదిలీలు, టీజీటీలకు పీజీటీగా పదోన్నతి కల్పించి ఆ తర్వాత టీజీటీలకు బదిలీలు చేపట్టాల్సి ఉందని పేర్కొన్నారు.పద్ధతి లేకుండా సొసైటీ ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా సొసైటీ ఉన్నతాధికారులు బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్‌ను సవరించాలని, జాబితాలో తప్పిదాలను గుర్తించి ఆ తరువాతే ప్రక్రియను చేపట్టాలని డిమాండ్ చేశారు.

నేడు 317 జీవో

క్యాబినెట్ సబ్ కమిటీ భేటీ

హైదరాబాద్, జూలై 18 (నమస్తే తెలంగాణ) : జీవో 317, జీవో 46పై ప్రభుత్వం నియమించిన క్యాబినెట్ సబ్ కమిటీ శుక్రవారం భేటీ కానున్నది. మంత్రులు దామోదర, శ్రీధర్ బాబు, పొన్నం హాజరుకానున్నారు. గత సమావేశంలోనే స్పౌజ్, మెడికల్, మ్యూచువల్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల భార్య/భర్త చేసుకున్న దరఖాస్తులపై కమిటీ సానుకూల నిర్ణయం తీసుకున్నది. ఈ నివేదికలను కమిటీ పరిశీలించే అవకాశం ఉన్నది. దీంతోపాటు 2008 డీఎస్సీ బాధితులకు ఉద్యోగాల అంశంలో విధివిధానాలపైనా సబ్ కమిటీ చర్చించే అవకాశం ఉన్నది.

రుణమాఫీ బిజీలో బదిలీలు లేనట్టేనా?

హైదరాబాద్, జూలై 18(నమస్తే తెలంగాణ): వ్యవసాయ శాఖలో ఉద్యోగుల బదిలీలపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఒక్క రోజే గడువు ఉండడం, ఇప్పటివరకు సీనియార్టీ జాబితా రూపొందించకపోవడంతో సందేహాలు ఉత్పన్నమవుతున్నాయి. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులతో పాటు క్షేత్రస్థాయి అధికారులు రుణమాఫీ కార్యక్రమంలో తలమునకలై ఉన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులకు కనీసం ఆప్షన్లు ఇచ్చుకునే అవకాశమూ లేకపోయింది. ఉన్నతాధికారులు బదిలీల జాబితాను సిద్ధం చేయడంపై దృష్టి పెట్టలేదు. ఈ నేపథ్యంలో ఈ షెడ్యూల్‌లో వ్యవసాయ శాఖ ఉద్యోగుల బదిలీలు సాధ్యం కాకపోవచ్చనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇందుకోసం గడువు కోరే ఆలోచనను చేస్తున్నట్టుగా తెలిసింది.

గాంధీ, ఉస్మానియా సూపరింటెండెంట్ల బదిలీ

- వైద్యశాఖలో బదిలీలు ప్రారంభం
- నిబంధనలు పాటించలేదని ఆరోపణ

హైదరాబాద్/సిటీబ్యూరో, జూలై 18 (నమస్తే తెలంగాణ): గాంధీ, ఉస్మానియా దవాఖానలను సుదీర్ఘకాలంగా నడుపుతున్న సూపరింటెండెంట్లను ప్రభుత్వం బదిలీ చేసింది. వైద్యశాఖలో ఉద్యోగుల బదిలీకి శుక్రవారం కౌన్సెలింగ్ ప్రారంభం అయ్యింది. గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావును యాదాద్రి భువనగిరి జిల్లా దవాఖాన సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో నల్లగొండ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రాజకుమారిని నియమించారు. ఉస్మానియా సూపరింటెండెంట్ నాగేందర్ మహేశ్వరం టీచింగ్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. వీరితోపాటు ఇద్దరు మాజీ డీఎంఈలు బదిలీ అయ్యారు. రమేశ్‌రెడ్డిని యాదాద్రి భువనగిరి జిల్లా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, త్రివేణిని మహేశ్వరం మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. నిజామాబాద్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఇందిరను గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా, కాకతీయ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ మోహన్‌దాస్‌ను నర్సంపేట మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా బదిలీ చేశారు. టీవీవీపీ, డీపీహెచ్‌లో పనిచేస్తున్న స్టాఫ్‌నర్సుల ట్రాన్స్‌ఫర్ల కౌన్సెలింగ్ కొనసాగుతున్నది. 20 నాటికి కౌన్సెలింగ్ ముగిస్తామని అధికారులు తెలిపారు. రాష్ట్రంలోనే కీలకమైన గాంధీ, ఉస్మానియా సూపరింటెండెంట్లను ఒకేసారి బదిలీ చేయడంపై వైద్య వర్గాల్లోనే అసంతృప్తి వ్యక్తం అవుతున్నది. కొవిడ్ సమయంలో రెండు దవాఖానలు కీలకంగా పనిచేశాయని చెప్తున్నారు. కొవిడ్ నోడల్ సెంటర్‌గా గాంధీ దవాఖానను డాక్